# మనసులు మారాలి!



అరిగే రామారావు

'ఎలాంటి పరిస్థితుల్లోనూ రేపు స్టేట్‌మెంట్ డిస్పాచ్ కావలసిందే, మిసెస్ శ్రీదేవి! స్టాఫ్ పని చేయటం లేదని కూర్చుంటే ఆఫీసు ఎలా ఫంక్షన్ అవుతుంది? యు మస్ట్ ఎక్స్‌ట్రాక్ట్ వర్క్ ఫ్రమ్ ది స్టాఫ్. స్లాక్‌నెస్ పనికిరాదు.'

'అలాగేసార్' అంది శ్రీదేవి. ఆఫీసరు యిక మీరు వెళ్ళవచ్చు అన్నట్టుగా తల వూపి మిగతా కాగితాలు చూడటం మొదలెట్టాడు.

శ్రీదేవి స్ప్రింగ్‌డోర్ తెరుచుకుని బయటపడింది. చికాకుగా తన సీటులో కెళ్ళి కూర్చుని టేబిల్‌బెల్ గట్టిగా కొట్టింది. స్టాఫ్ అంతా ఒకసారి తలలు ఎత్తి ఆమెవంక చూశారు ఆశ్చర్యంగా. శ్రీదేవి అంత విసుగ్గా, విసురుగా బెల్ కొట్టటమంటూ యింతవరకూ జరుగలేదు ఎప్పుడూ. అందుకే—సౌమ్యతకూ, ప్రశాంతతకూ నిర్వచనం శ్రీదేవి అని అనుకునే స్టాఫ్‌కు ఈ రోజు అంత ఆశ్చర్యంవేసి అంతా ఒకసారి తలలు ఎత్తి ఆమెవంక చూశారు. ప్యూను పరిగెట్టుకుంటూ వచ్చాడు.

'ఒకగ్లాసు మంచినీళ్ళు తీసుకురా. అలాగే వారిని పిలు' అంది శ్రీదేవి విసుగ్గా.

'ఎవరినండీ ?'

తలఎత్తి అతనివంక ఒకక్షణం చూచి అంది 'ఎ-టూ శేఖరంగారిని'.

ప్యూను వెళ్ళి మంచినీళ్ళు పట్టుకొచ్చాడు. చల్లటి మంచినీళ్ళు త్రాగేసరికి కాస్త తేరుకుంది. ఇందాకటి విసుగు కాస్తకాస్త జారుకుంది. ప్రతి నెలా ఏడో తారీఖుకల్లా హెడ్డాఫీసుకు పంపవలసిన స్టేట్‌మెంట్ ఈ నెల పదిహేనవ తారీఖు వచ్చినా పంపలేదని ఆఫీసరుగారు కారాలు మిరియాలు నూరాడు. ముప్పావు గంటసేపు ఉపన్యాసం దంచాడు. స్టాఫ్‌ని కంట్రోల్ చేయలేకపోతున్నారు అన్నాడు. ఆడది ఆఫీసులో అకౌంటెంట్‌గా చేయాల్సివస్తే పనులు యిలాగే తగులడతాయని ఆఖరికి సారాంశం తేల్చాడు. తాను ఆఫీసు విధులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నానన్న తృప్తి తనకుంది. కానీ ఎటొచ్చీ ఆ అకౌంట్స్ సెక్షన్‌లో— వర్క్ సరిగ్గా జరగటం లేదు. పంపవలసిన సమయానికి స్టేట్‌మెంటులు వెళ్ళటంలేదు—

మళ్ళీ ప్యూనును పిల్చింది. 'వారితో

చెప్పలేదా' అని అడిగింది.

'చెప్పానండి, వస్తా, పదమన్నారు' భయంభయంగా చెప్పాడు ప్యూను.

అతని తప్పేమీలేదు పాపం. ఇందాక ఆమె చెప్పగానే అక్కౌంట్స్ సెక్షన్ కెళ్ళాడు. శేఖరం దగ్గరకెళ్ళి 'అకౌంటెంటుగారు రమ్మంటున్నారండి' అని చెప్పాడు.

'ఎందుకట' అనడిగాడు శేఖరం.

'ఏమో తెలీదుసార్' అన్నాడు.

'వస్తాలే, పో' అన్నాడు శేఖరం విసుగ్గా.

ప్యూను మళ్ళీ వెళ్ళి చెప్పాడు. శేఖరం విసురుగాలేచి పెద్ద గాలిదుమారంలాగా అకౌంటెంట్ శ్రీదేవి సీటు దగ్గరకొచ్చి పడ్డాడు. బల్ల ముందున్న కుర్చీని బర్‌మని లాగి కూర్చున్నాడు.

'నీ కెన్నిసార్లు చెప్పాను నన్ను నీ బల్లదగ్గరకు పిలిపించవద్దని' అన్నాడు.

శ్రీదేవి తల ఎత్తి సౌమ్యంగా అతని వంక చూచింది. మళ్ళీ తల దించుకుని నిదానంగా అంది—'అవసరమైన పని ఉండి పిలిపించాను. నేనే మీ సీట్ దగ్గరకు వద్దామంటే సెక్షన్‌లో మిగతా వాళ్ళుంటారుగా. అందుకని మిమ్మల్నే యిక్కడికి రమ్మని పిలిపించాను.

'ఇప్పుడేం మునిగిపోయిందో' దబాయింపుగా అడిగాడు.

శ్రీదేవి కొన్ని క్షణాలు ఏమీ మాటాడలేదు. ఒకసారి ఆఫీసులో స్టాఫ్‌వైపు కలయ చూచింది. ఆమె చూడటం గమనించి మిగతా స్టాఫ్ తలలు దించుకుని రాసుకోవటం మొదలు పెట్టారు. శేఖరంవైపు చూచి ఎంతో సౌమ్యంగానే 'ఆ అకౌంట్స్ స్టేట్‌మెంట్ యింకా పంపలేదు'—అన్నది.

'అవును పంపలేదు' — శేఖరం నిర్లక్ష్యంగా, శ్రీ దేవి సీటుప్రక్కన ఉన్న కిటికీలోగుండా కనిపించే ఆకాశానికిచ్చిన జవాబు.

'పంపవలసినతేదీ ఎప్పుడు?' —అకౌంటెంట్‌గారి ప్రశ్న.

'ఏమో తెలీదు'—ఆకాశానికే జవాబు.

అతని పెడసరపు సమాధానానికి కొన్ని క్షణాలు ఏమీ మాటాడలేక పోయింది శ్రీదేవి. మళ్ళీ అంది—'సరే, నేనే చెప్పుతున్నాను. ఏడోతారీఖు. యివాళ పదిహేనో తారీఖు. ఆ స్టేట్‌మెంట్ యింతవరకూ మనం పంపలేదు. ఈరోజు హెడ్డాఫీసు నుండి రిమైండరు వచ్చింది. ఇందాక ఆఫీసరు నన్ను లోపలకు పిలిచి మొగం వాచేట్లు చీవాట్లు పెట్టాడు. మీరు నా పరిస్థితి కూడా చూడాలి. నేను అవతల ఆఫీసరుకు సమాధానం చెప్పుకోవాలిగా.'

'అయితే నన్నేం చేయమంటావ్'

'దయచేసి రేపు ఆ స్టేట్‌మెంట్ డిస్పాచ్ అయ్యేట్లు చూడండి.'

'అవదు'

'ఎందుకని?'

'కాష్‌బుక్‌నుండి యింకా పోస్టింగ్స్ జరగలేదు.'

'ఎలాగయినా రేపటికి ఆ పని పూర్తి చేయండి ప్లీజ్—'

శేఖరం ఏమీ సమాధానం చెప్పకుండా దురుసుగా లేచి చరచర తన సెక్షన్‌లోకి వెళ్ళాడు. శ్రీదేవి వెళ్తున్న అతనివంక చూచి బరువుగా నిట్టూర్చి తలపట్టుకుని కూర్చుంది.

శేఖరం 'అవ్వాలట అవ్వాలి, ఎలా అవుతుందో' అని గొణుక్కుంటూ ధుమ ధుమలాడుతూ తనసీట్లోకి వచ్చి కూర్చుని బల్లమీదున్న ఫైళ్ళు కోపంగా అటూ యిటూ పడేశాడు. ప్రక్కసీట్లోనే కూర్చున్న అతని ఆప్తమిత్రుడు అనంతు ధుమధుమలాడుతూన్న శేఖరాన్నిచూచి 'ఏంటి గురూ! ఏం జరిగింది?' అని మెల్లగా అడిగాడు.

'ఏముంది అక్కౌంట్స్ స్టేట్‌మెంట్ పంపలేదేమని అయ్యగారు అడిగారు. ఏమైనాసరే రేపటికి పంపాలి అని అమ్మగారు హుకుం జారీ చేశారు.

అనంతు స్నేహ పూరితంగా శేఖరం భుజాన్ని తట్టుతూ 'దీనికింత హంగామా చేస్తావేరా. బాధ్యతగల అకౌంటెంట్‌గా అడిగింది. అవతల ఆ ఆఫీసరు చండశాసనుడాయె ఇందులో ఆమెతప్పు ఏముంది?' అన్నాడు అనునయ పూర్వకంగా.

'అబ్బే ఆమెగారితప్పు ఏముంది? తప్పంతా నాదే ఆమెగారి మొగుడ్ని అవటం నాదే పెద్దతప్పు!' అన్నాడు కసిగా.

* * *

తప్పంతా నాదే ఈపాడు ప్రమోషను అంగీకరించటం అకౌంటెంటు అవటం. నాదే తప్పు—అనుకుంది శ్రీదేవి నుదురు నొక్కుకుంటూ. ఈయన ఎందుకిలా తన మీద కక్ష సాగిస్తున్నారో తనకెంత ఆలోచించినా అర్థం కావటం లేదు. రెండు నెలల క్రితం తనకు ప్రమోషను వచ్చినప్పుడు ఎంత ఆనందించారో—ఎంత సంబరపడ్డారో! నాకీ ప్రమోషనూ వద్దూ, పాడూ వద్దూ. మీరు పనిచేసే ఆఫీసులో, మీ మీద నేను సూపర్‌వైజరుగా ఉండటం, మీరు నా క్రింద పనిచేయటం నేను సహించలేను. నాకిలా క్లర్కుగా మీతోపాటు పనిచేయటమే బాగుంటుంది. ఈ ప్రమోషన్లూ, పదవులూ నాకొద్దు బాబు అంటె ఆమాట వినకుండా ఎన్నెన్నో కబుర్లు చెప్పారు—'ఆఫీసు జీవితంలో రోజుకు ఒక ఆరు గంటలు నీవు నాకు అధికారివి అయితే, బ్రతికినంత కాలం నేను నీ జీవితానికే అధికారిననే సంగతి మర్చిపోతున్నావు. నా పదవే గొప్పది. ఆసలు మనలో మనకి తారతమ్యాలేమిటి? ఈ తారతమ్యాలయినా కేవలం ఆఫీషియల్ కాకపోయినా నేను అంత సంకుచితుడిని కానులే. ఏమైనాసరే, నీవు ఈ ప్రమోషను అంగీకరించి తీరవలసిందే'—అని పట్టుబట్టి నాచేత ఎస్ అనిపించారు యిప్పుడు యిలా ప్రవర్తిస్తున్నారు ఏమనుకోవాలి......

యింతలో గోడగడియారం టంగ్‌న గంట కొట్టింది. శ్రీదేవి ఉలిక్కిపడి తల ఎత్తి చూచింది. పన్నెండున్నర—లంచ్ టైం. పెన్‌కేప్ మూసేసి సీటులోంచి లేచి డైనింగు రూంలోనికి వెళ్ళింది. ప్యూనువచ్చి స్టీల్ టిఫిన్ కారియర్, కాఫీఫ్లాస్కు ముందు పెట్టాడు. రెండు గ్లాసుల నిండా నీళ్ళు పెట్టాడు. కారియరు మూత తీసి పూరీలు రెండు ప్లేట్లలో సర్ది పెట్టి, శేఖరం కోసం ఎదురు చూస్తూ కూర్చుంది శేఖరం ఎంత సేపటికీ రాడు. రోజూ పన్నెండున్నర అయేసరికి వచ్చేవారు. ఈరోజు యింత వరకూ రాలేదు

'వెళ్ళి అయ్యగార్ని పిల్చుకురారా' అని ప్యూనుని పంపించి, కుర్చీలో జేరగిలబడి కూర్చుంది

ప్యూను వచ్చి మెల్లగా 'అయ్యగారు కాంటీను కెళ్ళుతున్నారండి. మీరు

# మనసులు మారాలి!

రమ్మన్నారని చెప్పితే కసురుకున్నారండీ' అని చెప్పి చల్లగా బయటికి తప్పుకున్నాడు.

శ్రీదేవి బ్రాన్పడిపోయింది. రోజూ కలిసి లంచ్ తీసుకునే ఆయన ఈ రోజు కాంటీన్‌కు ఎందుకు వెళ్ళినట్టు. నేనేం పాపం చేశానని ఆయన నన్నిలా సాధిస్తున్నారు. సీటు దగ్గరకు పిలిపించి స్టేట్‌మెంట్ యివ్వమని చెప్పినందుకా యింత కక్ష సాధిస్తున్నారు.

కొన్నిక్షణాలు ప్లేటులో పూరీలవంకే చూచి, బరువుగా నిట్టూర్చి మళ్ళీ వాటిని కారియర్‌లో పెట్టి సర్దేసింది. ఎదురుగా ఉన్న రెండుగ్లాసుల మంచినీళ్ళూ గడగడా త్రాగేసి కడుపు నింపుకుని మళ్ళీ తన సీటులోనికి వెళ్ళి కూర్చుంది.

* * *

శ్రీదేవి ఆఫీసునుండి యింటికి వచ్చేసరికి సాయంత్రం ఆరుగంటలు అయింది అప్పటికే బాబు, పాప స్కూలునుండి వచ్చి ఆటలు ఆడుకుంటున్నారు. వాళ్ళకు గబగబా నీళ్ళుపోసి వంటపనిలోనికి దిగింది. వంట పూర్తయ్యేసరికి ఏడుగంటలయింది. రేడియో టేబిల్ దగ్గర అలమరులో పాత న్యూస్‌పేపర్లు, పత్రికలు చిందరవందరగా పడి గందరగోళంగా ఉంది. వాటిని తీసి వరుసగా తేదీలవారీగా పెట్టి, వంటింట్లో పెట్టింది. అలమర అరల్లో దుమ్ము దులిపి, పాతన్యూస్ పేపర్లువేసి సామానులు అన్నీ చక్కగా సర్దింది, టేబిల్‌క్లాత్ మార్చి, టేబిల్‌మీద ఉన్న రాధాకృష్ణుల విగ్రహం, ఫ్లవర్‌వేజ్ అన్నీ సర్ది పెట్టింది. గంట ఏడున్నరయింది. అయినా శేఖరం యింకా యింటికి రాలేదు అతను వచ్చేటైం యింకా కాలేదు ఎనిమిది దాటితేగానీ, రాడు. ఆఫీసులోంచి మాత్రం ఠంచనుగా నాలుగు కొట్టేసరికి వెళ్ళిపోతాడు. ఆఫీసులో చాలామంది మూడున్నరయేసరికి పని చేయటం ఆపేసి, బాత్‌రూంలోకెళ్ళి మొహాలు కడుక్కోవటం, తలలు దువ్వుకోవటం మొదలుపెట్టుతారు. టాయిలెట్ అయింతర్వాత, సీట్లు సర్దేసి, ఆఫీసు గడియారంవంక చూస్తూ కూర్చుంటారు. ఆ 'చాలామంది'లో శేఖరంకూడా ఒకడు—గట్టిగా చెప్పాలంటే ప్రథముడు కూడా.

శ్రీదేవి మాత్రం అర్జంటు లెటర్సు చూస్తూ ఆఫీసరు వెళ్ళిపోయేవరకూ ఉంటుంది. ఆమె ఆఫీసునుండి బయల్దేరేసరికి రోజూ ఆరుగంటలకు తక్కువకాదు. ఆరుగంటలకు శ్రీదేవి యింటికివెళ్ళి వంటపని ముగించి భర్త రాకకోసం ఎదురు చూస్తూ కూర్చుంటుంది నాలుగయ్యేసరికి ఆఫీసునుండి బయటపడే శేఖరం యింటికి వచ్చేసరికి రోజూ ఎనిమిది దాటవలసిందే

కానీ, ఈరోజు తొమ్మిది అవవస్తున్నా యింటికి రాలేదు. శ్రీదేవి స్నానంచేసి ఉతికినచీర కట్టుకుంది. ఆఫీసునుండి వస్తూ తెచ్చిన మల్లెపూలు మాల కట్టుకుని ముడిచుట్టూ పెట్టుకుంది. సన్నగా రేడియో పెట్టి, వారపత్రిక తిరగేస్తూ, భర్తకోసం ఎదురు తెన్నులు సారిస్తూ కూచుంది. పిల్లలు కాస్సేపు చదువుకున్నారు 'అమ్మా, నాన్న యింకా రాలేదేం' అని అడిగి మెల్లగా పక్కలమీదకు జేరి నిద్రలుకూడా పోతున్నారు గడియారం తొమ్మిది గంటలు కొట్టింది. శేఖరం యింకా రాలేదు పత్రిక చదువ బుద్ధి కాలేదు అవతల పడేసింది. వెళ్ళి మంచంమీద కాస్సేపు పడుకుందామనుకుంది. మళ్ళీ మల్లెపూలు నలిగిపోతాయని ఊరుకుంది. దిండు గలీబులు మాసివున్నాయి. వాటిని తీసేసి, వేరే యిస్త్రీ గలీబులు తొడుగుతూ కూర్చుంది—

ఆమె గుండెల్లో ఏదో అర్థం కాని బాధ సన్నటి పోటులాగా ప్రారంభమయింది. తన భర్త ఈ మధ్య, తనకు ప్రమోషను వచ్చినప్పటి నుండి 'యింటికి కూడా ఆలశ్యంగా వస్తున్నారు. నాలుగు గంటలకే ఆఫీసునుండి బయటపడే ఆయన రాత్రి తొమ్మిది గంటలయినా బయట ఎక్కడ తిరుగుతుంటారో అర్థం కాకుండా ఉంది. ఎంత తిరిగినా, ఎన్ని పెత్తనాలు చేసినా గంటా, గంటన్నర—మరీ యింత ఆలశ్యమా. అసలు ఈయనకు చక్కపెట్టవల్సిన రాచకార్యాలేం ఉన్నాయ్. లోగడ తను ఆఫీసులో లేటుగా కూర్చుంటే 'యింటికి పోదాం పద— యివాళ్టికి ఆఫీసుపని కట్టిపెట్టు' అని ప్రక్కన కూర్చుని లేచేవరకూ గొడవ జేసేవారు. తనతోపాటు యింటికి వచ్చి పిల్లలతో ఆటలు ఆడుకుంటూ, తను వంటచేస్తుంటే ఎన్నో కబుర్లు చెప్పేవారు. అలాటిది ఈ మధ్య రాత్రి పిల్లలు నిద్రలు పోయినా యింటికి రావటంలేదు. చూడపోతుంటే ఈయన కావాలనే యింటికి ఆలశ్యంగా వస్తున్నట్లు ఉంది. ఈయన ఎందుకిలా మారిపోయారు? ఈయనలో ఈమార్పంతా తనకు ప్రమోషను వచ్చిన దగ్గర్నుండీ మొదలయింది. ఈ వెధవ ప్రమోషను ఎందుకొచ్చిందోగానీ తన సంసార జీవితంలోని ఆనందమంతా మెల్లి మెల్లిగా తుడిచిపెట్టుకు పోతోంది. అంతకుముందు ఆఫీసుకు యిద్దరూ కలసి ఒక రిక్షాలో కూర్చుని పోవటం, ఆఫీసు అయింతర్వాత యిద్దరూ చెట్లనీడన ప్రక్కప్రక్కనే నడుచుకుంటూ యింటికి పోవటం—అబ్బ, ఎంత మధుర సన్నివేశాలవి. అలా ఆయనతో కలసి నడవటం తనెంత గర్వంగా ఫీలయ్యేది యింటికి వచ్చినతర్వాత ఆయన చెప్పే అర్థం పర్థంలేని కబుర్లు వింటూ, పిల్లలతో ఆడుకుంటూ, హాయిగా ఆనందంగా ఒకగంట గడిపేసరికి పగలస్తమానం ఆరుగంటలసేపు ఆఫీసులో పడిన శ్రమంతా మర్చిపోయేది. మళ్ళీ కొత్త ఉత్సాహం, కొత్త ఊపిరి, రెట్టింపు బలం వచ్చేవి. ఈ ఉత్సాహానికి కావలసిన బలమంతా ఆయన తీయటి మాటల్లోంచి, అనురాగపు హృదయంలోంచి, చెట్టు పెద్దవేరు బలాన్ని భూమిలోంచి పీల్చుకున్నట్లు, పీల్చుకునేది. ఈ ఉత్సాహం వల్ల, ఆయన యిచ్చిన ప్రోత్సాహంవల్లే తాను రాత్రిళ్ళు ఎంతో ప్రొద్దుపోయే వరకూ మేల్కొని డిపార్టుమెంటు పరీక్షలకు చదివింది. మీరూ చదవండీ అంటే 'నేను చదవలేను శ్రీదేవి. కాకపోయినా నాకు నీకున్నంత ఓపికా, తెలివితేటలూ లేవు. నా బదులు నీవు చదువు. నీవు చదివితే చాలదూ. నీవు పరీక్షలు పాసయి ప్రమోషన్లు సంపాదిస్తే నేను సంపాదించినట్లు కాదా—' అనేవారు తనకు కావలసిన పుస్తకాలు దొరకకపోతే ఎంతో ప్రయత్నించి, సాధించి తెచ్చారు. ఆయన యిచ్చిన ప్రోత్సాహం, సహాయంవల్లనే

QUOTEQUIZ
FIRST CHOICE OF ALL QUIZ LOVERS
ONLY 15 CLUES
FABULOUS PRIZES
SPECIMEN COPY OF WEEKLY FREE
QUOTEQUIZ (P) LTD.
BOMBAY-1 DD

కాలెండర్ ఏజెంట్లు కావలెను
ఈ యేడాది మా రేటు చాలాగా తగ్గించినాము
14 × 22 సైజు పూర్తి క్యాలెండర్లు ఖరీదు
**1000 కాపీలు రు 220 మాత్రమే.**
అయినాకూడా ఏజెంటు కమిషన్ 30%
యివ్వబడును మీరు తేలికగా ఆర్డర్లు పొంది
విరామ సమయంలో
**అదనంగా డబ్బు సంపాదించవచ్చు**
200 ఆకర్షణీయమైన డిజైన్లుగల
ఆల్బమునకు రు. 20/— పంపండి
SIVAKASI CALENDARS SIVAKASI

వాయిదాల చెల్లింపుపై ట్రాన్సిస్టర్

"బ్రా బ్రా"
(వి.పి.తో)
3 బ్యాండ్, ఆల్‌వరల్డ్ పోర్టబుల్ ట్రాన్సిస్టర్‌ను నెలకు రు. 5/— వంతున చెల్లించే పద్ధతిన పొందండి. ప్రతి గ్రామమునకు, నగరమునకు పంపగలము. నేడే వ్రాయండి:
HIND AGENCIES (67)
Kolhapur Road, Delhi-7-

కావలెను

జపాన్ ఆర్టు చీరలు, టెరిలిన్ సూటింగులు, రెడీమేడ్ ఉడుపులు, శాల్వలు, నైలాన్ సాక్సు, వగైరాలకు ఆర్డర్లు పొందుటకై నెలకు రు. 650 జీతముపై లేక మంచి కమిషన్ పద్ధతిమీద సేల్సుమెన్ కావలెను. శాంపిలుకు వ్రాయండి
FOREIGN AGENCIES (66)
Post Box 1456, Delhi—6.

# మనసులు మారాలి!

తను అన్ని పుస్తకాలు చదివి పరీక్షలురాసి పాసవగలిగింది. ఆ పరీక్షలకు కూర్చున్న వారందరిలో తనొక్కర్తే పాసయిందని తెలిసినరోజున తనకంటే ఆయనే ఎక్కువ సంతోషించారు. తనొక్కర్తే పాసవటం వల్ల చాలమందికి తను జూనియర్ అయినా, ఆడది అయినా, తనకే ప్రమోషను యిచ్చారు. ఏదో సరదాకు పరీక్షలు రాశాను, నాకు ప్రమోషను వద్దు అంటే వినకుండా ఆయన బలవంతంచేసి వప్పించారు మరి అలాంటి ఆయన ఎందుకిలా ఈ రెండుమూడు నెలలనుండీ మారిపోయారు ఆయనకంటే రెట్టింపు జీతాన్ని సంపాదిస్తున్నప్పటికి ఆయన్ని తనేం చిన్న చూపు చూడటం లేదే. ఆయనకు తనిస్తున్న గౌరవంలో ఎలాంటి లోపమూ లేదే? ఎంత సంపాదించినా, ఏ పదవిలో వున్నా తను ఆయన పాదదాసియేకదా. మరెందుకిలా మారిపోయారు. ఆఫీసులోకూడా పని చేయటంలేదు అన్నీ కావాలని లేటు చేస్తున్నారు—ఆఫీసరుచేత తనకు చీవాట్లు పెట్టిస్తున్నారు. ఎందుకిలా ఆయన తనమీద కక్షగట్టి సాధిస్తున్నారో అర్థం కావటం లేదు.

సరిగ్గా అదేసమయానికి పార్కులో అదే ప్రశ్నలు శేఖరం స్నేహితుడయిన అనంతు అడిగాడు. శేఖరం ఏమీ మాటాడలేదు. ఆ ప్రశ్నలకు అతనిదగ్గర సమాధానాలు లేవు శేఖరం ఏమీ మాటాడక పోవటం చూచి అనంతు 'బ్రదర్ నీవు ఏమీ అనుకోనంటే ఒకమాట అంటాను, నీవు ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్సుతో బాధపడుతున్నావు. అవునా' అన్నాడు.

శేఖరంకు కోపం వచ్చింది. తానే విషయాన్నైతే 'కాదు, కాదు' అని మభ్య పెట్టుకుంటున్నాడో అదే విషయాన్ని అనంతు వేలు ఎత్తిచూపాడు. 'ఆల్‌రైట్ లెటజ్ డ్రాప్‌ది టాపిక్' అని లేచాడు.

అనంతు తనని యింతమాట అన్నాడేమిటి అని ఆలోచిస్తూ యింటివయిపు నడక సాగించాడు. నిజంగానే తనలో ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్సు ఉందా? మరీ అంత యిరుకా తన హృదయం. తనకెన్నో ఆదర్శాలున్నాయి. అవన్నీ నిజ జీవితంలో అనుభవంలో స్వార్థంగా, మానసిక బలహీనతలుగా మారిపోతున్నాయా? స్త్రీ అభ్యుదయ యుగంలో ఆడవాళ్ళు అన్ని రంగాల్లో ముందుకు రావాలని కాంక్షించే వారిలో తనూ ఒకడు. అలాంటిది తనభార్య తనకంటే పైచేయిగా ఉందని తనీ మానసిక బలహీనతకు లోనవుతున్నాడా? కాదు, కాదు. ఆమెని పరీక్షలకు కూర్చోమని ప్రోత్సహించింది తను. ఆమెకు ప్రమోషను వస్తే గర్వించింది తను. ప్రమోషను అంగీకరించమని బలవంతం చేసింది తను—మరి యిప్పుడు ఎందుకిలా సాధిస్తున్నాడు అనుకుంటే... కాదు, తనేం సాధించటం లేదు. ఆమెలో అహం తొంగిచూస్తుంది. తనేదో పెద్ద అకౌంటెంటుని అనుకుంటూంది. కాకపోతే తనని తన సీటుదగ్గరకు పిలిపించి స్టేట్‌మెంట్ వెళ్ళలేదేం అని అడుగుతుందా. చిటికిమాటికి ఆ సీటు దగ్గరకు పిలిపించటం దేనికి? ఓహో! నేను పెద్ద అకౌంటెంటును, నీవు నాక్రింద పన్చేసే క్లర్కుగాడివి అని ఎత్తి చూపటానికేగా. స్టేట్‌మెంటు పంపకపోతే సెక్షనుకు వచ్చి తనని అడగొచ్చుగా. సెక్షనులో మిగతా వాళ్ళు ఉంటారు అనుకుంటే ఒక చిన్న చీటీముక్కరాసి పంపించవచ్చుగా. యిదంతా తను యిప్పుడు ఎక్కువ పదవిలో ఉన్నాననే గర్వం కాదా. ఆపదవి తనకి రావటానికి కారకుడెవరో విస్మరించటం కాదా......

ఈ విధంగా ఆలోచిస్తూ వుంటే యిందాక అనంతు తనలోని లోపం ఎత్తి చూపినప్పుడు చెల్లాచెదరయిన భావాలు యిప్పుడు మెల్లగా మనసులోకి యిముడుతూ, యిందులో తన తప్పేమీ లేదు. అంతా తన భార్యదే తప్పు అన్న భావం తనలో బలం పుంజుకుని తనకు ఎంతో ఉపశమనం కలిగిస్తూ వుంది.

గదిలోపలకు అడుగు పెట్టగానే అటు వయిపుగా తిరిగి కూర్చున్న భార్య, నల్లటి ముడిచుట్టూ, తెల్లని మల్లెపూలూ, లైటు కాంతిలో మెరిసిపోతున్న అందమైన మెడ కనిపించాయి. మామూలుగా అయితే యిలా ఆమెని చూడగానే దగ్గరకు లాక్కుని, పూలు వాసనచూసి, మెడమీద పెదాలు ఆనించటం అలవాటు. యిప్పుడు కూడా బలంగా ఆ కోర్కె తనలో లేచినా, ఆమెమీద ఉన్న కోపం బలమైన ఆ

కోర్కెను బలవంతంగా అణచి వేసింది.

తను వచ్చిన అలికిడి వినగానే శ్రీదేవి వెనక్కు తిరిగి చూచి లేచి నిలబడింది. ఆఫీసులో అధికారం చెలాయించటం, యింటికిరాగానే అతివినయం చూపించటం ఎంతకయినా తగిపోయింది అనుకున్నాడు. రుసరుసలాడుతూ బట్టలు విప్పుకుని లుంగీ కట్టుకున్నాడు.

'ఇంత లేటు చేశారే?'

'లేట్‌చేశారే, గీట్ చేశారే అని అడగటానికి యిదేం ఆఫీసుకాదు—యిల్లు. నా యిష్టం!' అని రకీమని సమాధానం యిచ్చాడు.

ఈమాట ఆమెకు తగలవల్సినచోటే తగిలింది. అదే అతని ఉద్దేశ్యం కూడా. ఎందుకీయన తనమీద యింత దెబ్బ తీస్తాడనుకుంది.

మెల్లగా అంది 'మీకోసం పిల్లలు చూచి నిద్దర్లు పోయారు. నేను మీకోసం ఎంతో సేపట్నుంచి ఎదురు చూస్తున్నాను. మీ యింటికి యిల్లాలుగా ఆలశ్యమయిందేం అని అడగకూడదా? మామూలుగా అడిగానని ఎందుకనుకోరు? ఆఫీసు విషయం ఎత్తి ఎందుకు దెప్పిపొడుస్తారు?'

శేఖరం ఏమీ మాటాడలేదు

కొద్ది సేపు అయిన తర్వాత బరువుగా నిట్టూర్చి శ్రీదేవే,

'సరే, లేవండి స్నానం చేద్దురుగానీ' అని అంది.

'చేయను'

'అయితే భోజనం వడ్డించనా?'

'అక్కర్లేదు'

'ఏం? భోంచేయరా?'

'అక్కర్లేదు'

'ఎందుకండీ నన్నిలా సాధిస్తారు?'

శ్రీదేవి కంఠం రుద్ధ మయింది.

'నన్నవసరంగా విసిగించకు' మంచం మీద అటువయిపుగా తిరిగి పడుకున్నాడు.

'ఏవండీ!'

'నీక్కాదూ చెప్పేది నన్నవసరంగా విసిగించవద్దని'

శ్రీదేవికి ఏడ్పు ముంచుకు వస్తోంది. గుడ్లనీళ్లు గుడ్లకుక్కుకుంది. కొన్ని నిమిషాలకు ఎలాగో స్థిమితపడి బరువుగా లేచి వంటిల్లు సర్ది తలుపులు వేసి వచ్చింది.

ఇలా అలిగి అన్నం తినకుండా పండుకోటం ఈ నెలలో అప్పుడే రెండోసారి. మొన్న శివరాత్రి రోజున యింటి దగ్గర ఆఫీసుకని బయలుదేరినవారు మధ్య దారిలో ఆఫీసుకు రాకుండానే సెలవుచీటీ పంపించి కోటప్పకొండ తిరణాలకు పోయి రెండో రోజున ఎప్పుడో వచ్చారు.

'ఎందుకండీ అనవసరంగా శలవల్నీ వేస్టు చేసుకుంటారు యిది తిరణాళ్లకూ, జాతర్లకూ పోవల్సిన వయస్సేనా?' అని అడిగేసరికి—


'నీవు ఏ హోదాలో ఈ ప్రశ్న వేస్తున్నావు?' అని పెద్ద రాద్ధాంతం చేసి ఆవేళ యిలాగే భోంచేయకుండా పస్తు పడుకున్నారు

ప్రతీ చిన్న విషయానికీ ఆఫీసులో ముడిపెట్టి పెద్ద రాద్ధాంతం చేసి సంసారంలో ఆనందం లేకుండా ఒక నరకంగా చేస్తున్నారు. ఈ మనిషికేం పట్టిందనుకోవాలి?...

...దీనికి మహా గర్వం పట్టింది ఎంత గర్వం కాకపోతే వంటిల్లు సర్ది తలుపేసి వస్తుంది. లోగడంతా యిలాగే చేసిందా? లోగడ ఎన్నిసార్లు అలిగి అన్నం వద్దని పండుకోలేదు. అప్పుడు బ్రతిమాలి, కాళ్లా వేళ్లా పడి, కంచంలో అన్నం కలుపు కొచ్చి ముద్దుచేస్తూ ముద్దలు తినిపించలేదా. యిప్పుడు అన్నం వద్దన్నాననుకో—లోగడలాగా బ్రతిమాలకూడదా? ముద్దలు తినిపించకూడదా? అనటమే తడవుగా ఏకంగా వంటింటికి గొళ్లెమే పెట్టి వచ్చింది. తనొక అకౌంటెంట్‌ని, ఈ క్లర్కు మొగుడిగాడ్ని బ్రతిమాలాలేం అన్న గర్వం కాదా. ఎంత నంగనాచి, తుంగ పీచు. ఆ ఘాలే, అనంతుగాడు, తప్పంతా నాది అంటాడు. ఈవిడగార్కి దగ్గరెంత శానాతనముందో వాడికేం తెలుసు...శేఖర్ లోని కోపం ఇలాటి ఆలోచనల్ని రేపింది.

శ్రీదేవి నిద్రపోతున్న పిల్లలకు దుప్పటి కప్పింది. అమాయకంగా నిద్రపోతున్న వాళ్లవంక కాస్సేపు కన్నార్పకుండా చూచింది. 'మీకోసం — మీ బంగారు భవిష్యత్తుకోసమే మీ అమ్మ ఈ పాడు ప్రమోషను అంగీకరించి, ఈ ఉద్యోగం వెలగబెట్టుతూంది. ఇలా నలిగిపోతున్నది మీకోసమే నేను నలిగిపోయినా, నాశనమైపోయినా మీరు బాగుండాలి. అందుకే నేను బ్రతుకుతున్నది—' అని అనుకుంది.

కూజాలోంచి నీళ్లు వంపుకుని రెండు గ్లాసులు నీళ్లు రాగి కడుపు నింపుకుంది. గదిలో ట్యూబలైటు తీసి, టేబిల్‌లైటు వెలిగించింది. సాయంత్రం ఆఫీసునుండి తీసుకొచ్చిన ఫైళ్లు ముందేసుకుని కూర్చుంది. ఆ ఫైలు శేఖరం పంప



వల్సిన స్టేట్‌మెంట్ తాలూకు ఫైలు. అతనిపని తను చేయటానికి యింటికి తీసుకొచ్చింది.

శేఖరం గురకను ఛేదిస్తూ గడియారం గంగుంగుమని పదకొండు గంటలు కొట్టింది.

*　　*　　*

రెండురోజుల తర్వాత శేఖరం ఏదో కాగితాలు సంతకాలు పెట్టించటానికి ఆఫీసరు గదిలోనికి వెళ్ళాడు. ఆఫీసరు సంతకాలు చేస్తూ ఫలానా స్టేట్‌మెంట్ పంపేసింది మీరేనా అడిగాడు. అవునని సమాధానం యిచ్చాడు శేఖరం.

'ఈసారి పంపిన స్టేట్‌మెంట్ చాలా బాగుంది. ఫుట్‌నోట్స్ అవీ బాగా యిచ్చారు. ఐయామ్ వెరిమచ్ ప్లీజ్‌డ్. బాగుంది. 'ప్లీజ్ కీపిట్ దిస్' అన్నాడు ఆఫీసరు.

శేఖరంకు మతిపోయినట్టనిపించింది. ఆ స్టేట్‌మెంట్ యింకా పంపలేదు — పంపుదామనుకుంటున్నాడు. ఈ లోపలే శ్రీదేవి పంపి ఉంటుంది. ఆరాత్రి రెండు గంటలవరకూ యింటిదగ్గర పనిచేసింది దీన్నిగురించే అయివుంటుందనుకున్నాడు. బెరడులు కట్టిన శేఖరం మనస్సు కాస్త మెత్తపడింది.

ఆఫీసరు గదినుండి బయటికి వస్తూ శ్రీదేవి సీట్‌వంక చూశాడు ఆమె పెద్ద

# మనసులు మారాలి!

చాటంత రిజిష్టర్లు ముందేసుకుని వాటితో కుస్తీ పడుతూంది. ఆ దృశ్యం చూచేసరికి అతనిమనస్సు యింకాస్త మెత్తపడింది. ఆమె ఎవరికోసమిలా కష్టపడి పనిచేస్తున్నది నాకోసం, పిల్లలకోసం సంసారం కోసం కాదా. క్లర్క్‌గా ఉంటే యింతపని ఉంటుందా. మిగతా వాళ్ళలాగా రిజిష్టర్ల క్రింద వారపత్రికలు పెట్టుకుని సీరియల్స్ చదువుకోలేకనా, ఈ శ్రమంతా దేనికి? తనే మూర్ఖంగా ప్రవర్తిస్తున్నాడా అనిపించిందతనికి.

ఆరోజు లంచ్ టైంలో భార్యతో మనసు విప్పి ఎన్నెన్నో విషయాలు మాటాడాడు. మనసారా నవ్వాడు ఆమెని నవ్వించాడు – మళ్ళీ యినుపటి శేఖరం అయ్యాడు 'మీరిలాగే ఉండాలి జీవితాంతం యిలాగే నన్ను నవ్విస్తూ ఉండాలి. నా అవసాన దశలో కూడా యిలాగే నవ్వుతూ మీ చేతుల్లో ప్రాణాలు వదులుతాను. నాకు కావల్సింది అదే' అని అనుకుంది మనసులో శ్రీదేవి. ఆమెకెంతో బలం, ఉత్సాహం వచ్చింది. ఈయనిలా ఈవగాడ్పు యిలాగే నిలుస్తుందా అన్న శంక మళ్ళీ మనసులో ఏదో మూల కదిలింది.

ఆరోజు మధ్యాహ్నం మూడు గంటలకు శేఖరం ప్యూను చేత ఒక చీటీ పంపించాడు — ఈ రోజు మొదటాటకు 'మూగనోము' సినిమాకు పోదాం. పని తొందరగా తెముల్చుకుని నాలుగు గంటలకే నీ డ్రకాణం కట్టేయి' — అని.

అబ్బ, యిద్దరం కలిసి సినిమాకెళ్ళి ఎన్నిరోజులో అయింది. ఇవాళ సినిమా కెళ్ళవల్సిందే అనుకుంది. సినిమాకెళ్ళాలన్న హుషారులో ముందున్న ఫైళ్ళను చకచక చూసి సంతకాలు పెట్టింది. నాలుగయ్యేసరికి శేఖరం ఆమె దగ్గరికి వచ్చి

'నీవు తొందరగా యింటికెళ్ళి పిల్లల్ని రెడీ చేస్తూవుండు. నేనిప్పుడే అనంతు యింటికెళ్ళి వస్తాను' అని చెప్పి హడావుడిగా వెళ్ళిపోయాడు.

పిల్లల్ని తయారుచేసి తను జడవేసుకుంటూండగా శేఖరం చెమటల్లో కక్కుకుంటూ సుడిగాలిలా వచ్చిపడ్డాడు.

'మీరంతా రెడీయేనా, ఏదీ. నేను కూడా స్నానం చేసివస్తాను' అని బాత్‌రూంలో కెళ్ళాడు.

శ్రీదేవి జడవేసుకోవటం పూర్తిచేసి, పౌడరు రాసుకుని, బొట్టు పెట్టుకుంటూండగా ఒక ఆలోచన వచ్చింది— నెలాఖరు రోజుల్లో సినిమాకని బయలుదేరదీశారు, యింతకీ ఈయన దగ్గర డబ్బు ఉందా అని. బొట్టు పెట్టుకుని భర్త పాంటుజేబులో చూచింది. అంతా కలిసి రూపాయి పదిపైసలు వుంది. జేబులో రూపాయి పదిపైసలు పెట్టుకుని సినిమాకు పోదామంటున్నారు, ఏమిటీయన— సినిమా టికెట్లకూ, రిక్షాలకూ ఎంత లేదన్నా 7, 8 రూపాయలు కావాలి. అంత డబ్బు తన దగ్గర లేదే ఈ మూడు నాల్గురోజులకు యింటి ఖర్చులకు తన దగ్గర నాల్గయిదు రూపాయలున్నాయి. యిప్పుడు సినిమా కెళ్ళకపోతే కొంపేమి మునిగిపోయింది. జీతం వచ్చిన తర్వాత పోకూడదా. యిదేమాట ఆయనతో అంటే పెద్ద రాద్ధాంతం చేస్తారు ఈ రోజే కాస్త మనసు విప్పి మాటాడారు. మళ్ళీ గొడవ అవుతుంది, ఎలా? యిక పిల్లల డబ్బులోంచి తీయవల్సిందే — పిల్లల కోసం ప్రతినెలా కొంత డబ్బు తీసి దాచిపెట్టుతూ ఉంటుంది. ఎంతో అత్యవసరమైన పరిస్థితి వస్తేగాని ఆ



డబ్బు కదిలించదు. అందులోంచి పది రూపాయల కాగితం తీసి భర్త పాంటు జేబులో పెట్టింది.

రిక్షాలో కూర్చుని సినిమాకు పోతూండగా మధ్యలో శేఖరం సిగరెట్టు పెట్టె కోసం జేబులో చేయి పెట్టాడు. శ్రీదేవి పెట్టిన పదిరూపాయల కాగితం చేతికి తగిలింది. బయటికి తీసి ఆశ్చర్యంగా 'ఇదెక్కడిది డబ్బు' అని అన్నాడు

శ్రీదేవి మెల్లగా 'యిందాక వేట్టాను' అంది.

'ఎందుకు?'

'సినిమా టికెట్ల కోసం'

శేఖరం మొహం జేవురించింది — 'నా దగ్గర డబ్బు లేదనుకున్నావా?'

'మీ జేబులో చూశాను, రూపాయి పది పైసలు వుంది. అందుకని నేనే పెట్టాను.'

'అంటే, నా దగ్గర డబ్బు లేకుండానే సినిమాకు బయలుదేరదీశాననుకున్నావా? అసలు నీకా అనుమానం ఎందుకొచ్చింది. అసలు నీవు నా జేబులో చేయి ఎందుకు పెట్టావు?'

'ఇప్పుడేమయిందండీ—'

'ఏమయిందా? యిది నన్ను ఇన్సల్టు చేయటం కాదా. ఎంత గుమాస్తా వెధవనయినా నా పెళ్లాం బిడ్డల్ని సరదాగా సినిమాకు తీసికెళ్లే తాహతు లేదనుకున్నావా? అసలు నాదగ్గర డబ్బుల్లేవని ఎలా అనుకున్నావు? యిదేమిటి?' అని బర్ మని చొక్కా చేతి మడతలాగి పది రూపాయల కాగితం బయటికితీసి శ్రీదేవి మొహంమీద పెట్టి గద్దించి అడిగాడు.

శ్రీదేవి తలవంచుకుంది.

'సంసారమంతా నీ సంపాదనమీద, నీ డబ్బుమీద జరుగుతూందని నాకెత్తి చూపటానికి, నన్ను అవమానించటానికేగా నీవీ పనిజేసింది.'

'ఎందుకండీ, నేను అననివన్నీ ఊహించుకుని మాట్లాడతారు'

'నోటితో అంటే ఒకటిన్నూ, చేతితో చేస్తే మరొహటీనా? నీ కుచ్ఛితబుద్ధి అంతా తెలుస్తూనే ఉంది'

ఇంతలో రిక్షా హాలుముందుకొచ్చి ఆగింది. శేఖరం రిక్షాలోంచి ఒక దూకు దూకాడు రిక్షాకు డబ్బులు యిచ్చి బుకింగ్




# మనసులు మారాలి!

దగ్గర కెళ్ళాడు. తిరిగివచ్చి శ్రీదేవి చేతిలో మూడు టిక్కెట్లు పెడుతూ 'మీరెళ్ళండి' అన్నాడు.

'మీరు?'

'నేను రాను, మీరెళ్ళండి'

శ్రీదేవి యింకేదో చెప్పబోయే లోపలే శేఖరం విసురుగా దూసుకు పోయాడు.

అక్కడికీ 'ఏమండీ' అని పిలిచింది కూడా.

వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళ పోయాడు. శ్రీదేవి కొన్ని నిముషాలు ప్రాణ్పడి అలాగే నిలబడిపోయింది. పిల్లలు 'అమ్మా, సినిమా మొదలుపెట్టేతారు. లోపలికి పోదాం పదమ్మా' అని గొడవ చేయటం మొదలుపెట్టారు

'లేదు పాపా ఇవాళ కరెంటు పోయింది. అందుకని సినిమా లేదు యింటికి పోదాం పదండి' అంది శ్రీదేవి.

'అబద్ధాలు చెప్పుతావెందుకమ్మా' అని పాప అంది.

'అనవసరంగా విసిగించకుండా నోరు మూసుకుని పదండి' అని పిల్లల్ని గదమాయించి సినిమా టికెట్లు ఎవరికో యిచ్చేసి యింటికి బయల్దేరింది శ్రీదేవి పిల్లల్ని తీసుకుని.

బయట గేటు తీసుకుని లోపలికి అడుగుపెట్టిన తర్వాతగానీ యింటి తాళం చేతులు భర్త దగ్గరే వుండిపోయిన విషయం గుర్తుకు రాలేదు. ఆయన ఎప్పటికి వస్తారో. ఆయన వచ్చేదాక ఎక్కడికి పోతుంది పిల్లల్ని తీసుకుని. అరుగుమీద కూలబడింది.

కొబ్బరిచెట్ల ఆకుల సందుల్లో ఇరుక్కుని గిజగిజలాడి పోతున్నాడు విదియ చంద్రుడు. మబ్బులమాటున చుక్కల చిన్నారి హృదయాలు స్పందిస్తున్నాయి. శ్రీదేవి గోడకి జేరగిలబడి కూర్చుంది.

'అమ్మా ఏదయినా కథ చెప్పమ్మా' అని పాప అడిగింది

'చెప్పమ్మా' అని బాబు అన్నాడు.

ఏదో పిచ్చికథ చెప్పింది. కథ పూర్తయ్యే సరికి పిల్లలిద్దరూ తన ఒళ్లో పడుకుని నిద్రపోయారు.

మాదాకవళం అడుక్కునే అమ్మ తన మీద దయి జూపమని వెంకటేశ్వరస్వామి మీద ఏదో పాట పాడుతూంది. శ్రీదేవికి దుఃఖం ఉబికి ఉబికి వస్తోంది. అంతూ పొంతూ లేని భావాలతో మనస్సంతా చిక్కులుపడ్డ దారంబంతిలా గా గజిబిజిగా ఉంది.

భర్తతో, పిల్లలతో సర్దాగా సినిమా చూస్తూ గడపాలనుకున్న ఈ రోజు ఆఖరికి ఇలా పరిణమించింది. ఈయన ఎందుకిలా ప్రవర్తిస్తున్నారు? సుఖంగా సాగిపోవల్సిన సంసారాన్ని ఎందుకిలా దుర్భరంగా తయారు చేస్తున్నారు. ఇందులో తన తప్పెంత వరకు? తనపాత్ర ఏమిటి? అంతకుముందు ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. ఈ వెధవ ప్రమోషను వచ్చిన దగ్గర్నుండీ యిలా మారిపోయారు. ఆనాటినుండి తన సంసారానికి ముప్పు మొదలయింది. ఆనాటి నుండే తన ఆనందం తుడిచిపెట్టుకు పోవటం ప్రారంభమయింది. ఆనాటినుండే యిద్దరిమధ్యా అగాధాలు ఏర్పడ్డాయి. ఈయన మనస్తత్వం ఎంత ఆలోచించినా అంతుపట్టకుండా ఉంది ఆయన్ని నేనేదో చులకనచేస్తూ చిన్నచూపు చూస్తున్నట్లుగా లేనివన్నీ ఊహించుకుంటూ ఆయన బాధపడుతూ నన్ను బాధ పెడుతున్నారు. ఆయన్ని తను చులకనగా చూడటమేమిటి? అప్పుడయితే యిక తను బ్రతికి ఎందుకు?

ఆడది అకౌంటెంటు ఏమిటని అందరూ అనుకుంటున్నా, యిరవై మంది మగాళ్లమీద అధికారం చెలాయించ వల్సి వచ్చినా, ఎద్దు చాకిరీ చేయవల్సి వచ్చినా — అన్నిటికీ సహించి ఎందుకి అకౌంటెంటు ఉద్యోగం వెలగబెట్టుతూంది. తన సంసారంకోసం, తన పిల్లల భవిష్యత్తుకోసం కదూ. ఈ ప్రమోషను రావటంవల్ల అదనంగా నెలకు దాదాపు వందరూపాయలు జీతం వస్తుంది. ఆరోజు నాయన ప్రమోషనుకు వప్పుకోమని కోరి నప్పుడు తను డబ్బుపరంగా ఆలోచించి ఎక్కువజీతం వస్తుంది, తన పిల్లలు, తాను, తనభర్త హాయిగా దర్జాగా బ్రతక వచ్చునుగదా అని అంగీకరించింది. అంతకు ముందు చాలీచాలని జీతంలో, ప్రతినెలా అప్పులుచేస్తూ ఎన్నో యిబ్బందులు పడ్డారు. యిప్పుడిప్పుడు ఈ ప్రమోషను మూలంగా అప్పులు లేకుండా నెలకు పదో వరకో వెనకేయగలుగుతున్నారు. ఇలా ప్రతి నెలా కొంత దాచిపెట్టితే రేపు పాప పెళ్లి పేరంటాలకు పనికివస్తుంది కదా అనుకుంది. కానీ సంసారం కోసం, పిల్లల భవిష్యత్తుకోసం ఏ ప్రమోషను అంగీకరించిందో ఆ దే ప్రమోషను తన సంసారిక జీవితానికి గొడ్డలి పెట్టు అవుతుందని ఊహించలేదు. ఏ డబ్బుతో పిల్లల బంగారు భవిష్యత్తుకు మెట్లు కట్టాలనుకుందో ఆ డబ్బే పిల్లలకు తండ్రిప్రేమని దూరం జేస్తుందని ఆలోచించలేదు. రేపటికోసం ఈ రోజును నరకం చేసుకోలేను యిక — రోజు రోజుకూ పెరిగిపోతున్న ఈ అగాధాలను, గుండెకోతలను యిక భరించేశక్తి తనలోలేదు. తనసంసారం లోని ఆనందాన్ని పణంగా పెట్టుకుని తను ఈ పదవుల కోసం ప్రాకులాడలేదు. పోనీయ్ — అసలు ప్రమోషనే రాలేదను కుంటే సరి. ఏదో చదువుకున్నది కాబట్టి, ఈ ఉద్యోగం దొరికింది కాబట్టి, సరి పోయింది. అసలు తనకు ఉద్యోగమే లేక పోతే, ఆయన రెక్కల కష్టం మీద, ఆయన సంపాదనమీదే ఆధారపడి వుండ వల్సిందేగా. ఈ దేశంలో ఆడవాళ్లంతా ఉద్యోగాలే చేస్తున్నారా! జీతం చాలక పోతే వచ్చేజీతాన్ని పొదుపుగా వాడుకుంటాం, అనవసరమైన ఖర్చులు తగ్గిస్తాం, అవసరమైతే పస్తులు పడుకుంటాం. అంతే గానీ, ఈ నరకాన్ని యిక భరించలేను … నా సంసారానికి నీళ్లు వదులుకోలేను…

యిలా ఆలోచిస్తూ ఎప్పుడు కన్ను మూసిందో మూసింది. తొమ్మిది గంటలకు శేఖరంవచ్చి తలుపుతాళం తీస్తుండగా మెలకువ వచ్చింది.

అరుగుమీద కూర్చుని నిద్రపోతున్న భార్యనీ, పిల్లలనీ చూడగానే — వాళ్లు సినిమాకెళ్లకుండా తిరిగివచ్చి సాయంత్రం నుంచీ అలాగే అరుగుమీద కూర్చున్నారన్న విషయం తెలుసుకోగానే శేఖరం మనస్సుకు కట్టిన బెరడ్లు ఒక్కొక్కటే విడిపోయింది. పెద్ద నేరం చేసినట్లు ఫీలయ్యాడు.

భోంచేసి, మంచం మీద పండుకుని సిగరెట్టు త్రాగుతూ కిటకీలోంచి కనిపించే కాస్తంత ఆకాశాన్ని, మబ్బు తునకల్ని, వాటిమీద పొదిగిన నక్షత్రాల్ని

# రచయితలకు మనవి

## కథలు, వ్యాసాలు

ప్రచురణకి స్వీకరింపబడని తమ వ్రాత ప్రతులని తిప్పిపంపగోరే రచయితలు వ్రాత ప్రతులతోబాటే తగుమాత్రం తపాలాబిళ్లలు అతికించిన, స్వంత చిరునామాకల కవరు కూడా పంపాలి. స్టాంపులు మాత్రం పంప రాదు. స్టాంపులు మాత్రం పంపించినట్లు యితే వ్రాతప్రతుల తిప్పిపంపబడవు వ్రాత ప్రతులతో గాక విడిగా స్వంత చిరునామా, తగుమాత్రం పోస్టేజికల కవర్లు పంపినా వ్రాతప్రతులు తిప్పిపంపబడవు.

ప్రచురణకి స్వీకరింపబడని వ్రాతప్రతుల విషయంలో ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.

## నవలలు

ప్రచురణకి, స్వీకరింపబడని నవలల వ్రాత ప్రతులు మేమే తిప్పి పంపిస్తాము. వ్రాత ప్రతులతో స్వంత చిరునామాకల, తగు మాత్రం పోస్టేజి అతికించిన కవర్లు పంప నవసరం లేదు. 100 ఆరరావు సేజీల పయిన ఉన్న వ్రాతప్రతులే నవలలకింద పరిగణింప బడుతాయి.

## కార్టూన్లు

ప్రచురణకి స్వీకరింపబడని కార్టూన్లు తిప్పి పంపగోరేవారు కార్టూన్లతో స్వంత చిరునామాకల, తగుమాత్రం పోస్టేజి అతికించిన కవర్లు జతపరిచి పంపాలి స్టాంపులు మాత్రం పంపరాదు.

షరా: వ్రాతప్రతులనీ, కార్టూన్లనీ వీలయినంత భద్రంగా తిప్పిపంపే ప్రయత్నాలు చేస్తాము: కాని, వాటి విషయములో ఎటువంటి బాధ్యతనీ స్వీకరించలేము. ఈ షరతుని గమనించి రచయితలు తమ రచనలు, కార్టూన్లు పంపగలరు.

సంపాదకుడు

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

# మనసులు మారాలి!

చూస్తూ ఉన్నాడు. చిన్న కిటికీలోంచి చూస్తే చిన్నదిగా, పెద్ద కిటికీలోంచి చూస్తే పెద్దదిగా కనిపించే ఆకాశంలాగా స్త్రీ హృదయంకూడా చూచే సాధనాన్ని బట్టి, వ్యక్తి దృష్టినిబట్టి కనిపిస్తుందేమో! అవును, నిజంగా యిన్నాళ్ళుగా తను ఇరుకు కంతల్లోంచి చూస్తున్నాడు. జరిగిన సంఘటలన్నిటినీ ఒకదాని ప్రక్కనొకటి పెట్టుకుని నిదానంగా ఆలోచిస్తే అనంతు అన్నట్లుగా నిజంగా తనలో ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్ ఉందనిపిస్తోంది. ఉంది కాబట్టే యిరుకు కంతల్లోంచి చూస్తూ, యిరుకుగా ఆలోచిస్తూ తను బాధపడుతూ, భార్యని బాధపెట్టుతున్నాడు, అన్నెం పున్నెం ఎరుగని పిల్లల్నికూడా చీటికీమాటికి కసురుకుంటూ వాళ్లకు తండ్రిప్రేమను కరువుచేస్తున్నాడు. ఇదంతా ఏమిటి? ఇందాక పార్కులో అనంతు అన్న మాటలు గుర్తువచ్చాయి—

'ఇదంతా ఏమిటి? నీ మానసిక బలహీనతోయ్! ఏం, సినిమా టికెట్లకోసమని ఆమె నీ జేబులో పదిరూపాయలు పెట్టిందనుకో అందులో నామోషి ఏమిటి? ఇదివరకెప్పుడు, నీదగ్గర డబ్బుల్లేనప్పుడు ఆమెను అల్లించి బెల్లించి ఆమెపెట్టెలో చీరమడతల్లో దాచుకున్న డబ్బు తీయించి యిద్దరూ కలిసి సినిమాకు పోలేదా? అప్పుడెందుకని ఈ నామోషి ఫీలవలేదు యిప్పుడు కూడా అలాగే స్పోర్టివ్‌గా ఎందుకు తీసుకోకూడదు? నీవు ఏమనుకోనంటె నీ మొహాన కొట్టినట్టు సూటిగా ఒక ప్రశ్న అడగమంటావా? నీవు నామోషి ఫీలవటమంటూ వస్తే అసలు మొదట నీ భార్యచేత ఉద్యోగం చేయిస్తూ ఆవిడ సంపాదన తింటూ, నీబరువు బాధ్యతల్ని కొంతవరకు తగ్గించుకున్నందుకు నీకు నామోషి లేదా?...అసలు భార్యాభర్తల మధ్య నామోషీలూ, సోమాసీలూ ఏమిటోయ్? ఓరి పిచ్చితండ్రి యిదంతా నీ మానసిక బలహీనత. నీ బుద్ధిలోని; నీ ఆలోచనల్లోని వక్రత. భార్యాభర్తల మధ్య ఎంత అవగాహన ఉండాలి. యిలాంటి సమస్యలు సమస్యలేకావు టకాటకీ మాట్లాడుకుని అన్నీ క్లియర్ చేసుకోవల్సిందిపోయి అనవసరమైన అపోహలూ అపార్థాలూ పెంచుకుని బాధపడుతూ పార్కులవెంట తిరగటమెందుకు?

నిజంగానే తనబుద్ధి వక్రించింది లేకపోతే ఇలా ప్రతి చిన్నవిషయానికీ ఇంత పెద్ద రాద్ధాంతం చేస్తాడా? రేపు శ్రీదేవి అసలు నేను ఉద్యోగం చేయనంటే తనగతి ఏమిటి? తన బోడిజీతంతో ఈ సంసారాన్ని లాక్కురాగలడా? అనంతు అన్నట్లు భార్యాభర్తలు కాడెద్దులలాంటి వాళ్లు. ఏ ఎద్దు ఎంతబరువు మోస్తుందన్న సమస్యకాదు. బండి సాఫీగా తాపీగా నడుస్తున్నదా లేదా అన్నదే ముఖ్యం...

చేతివేళ్లను చురచుర లాడించిన సిగరెట్టు పీకను బయటకు గిరాటేసి ఇటువయిపు తిరిగాడు. శ్రీదేవి పిల్లల మధ్య చిన్నపిల్లలాగా పాపను కరచుకుని నిద్రపోతోంది.

'పూర్ శ్రీ' అనుకున్నాడు. ఆమెవంక జాలిగా, ప్రేమగా చూస్తూ మంచినీళ్లు త్రాగి మళ్లీ పండుకున్నాడు.

శ్రీదేవికి ఎక్కువ జీతంతోపాటు, ఎక్కువ బాధ్యతలు, రెట్టింపయిన పని బరువు నెత్తినపడి సతమత మవుతూంటే, ఆమెకు తన చేతనయినంత సహాయం చేయవల్సింది పోయి, తన పనికూడా ఆమెచేత చేయిస్తూ, యింకా పైగా సాధిస్తున్నాడు నిజంగా తను ఉత్త ఫూల్!

తన తక్కువతనం తను ఫీలవకుండా వుండాలంటే తనుకూడా తన భార్యలాగా అకౌంటెంటు అవ్వాలి. అవ్వాలంటే డిపార్టుమెంటు పరీక్షలకు చదివి పాసు కావాలి. అనవసరంగా యింతవరకూ కాలమంతా స్నేహితులతో షికార్లుతిరిగి, సినిమాలు చూచి 'బేఫర్వా'గా గడిపేశాడు. ఇకనుంచి అన్నిటికీ స్వస్తిచెప్పి బుద్ధిగా పరీక్షలకు చదవాలి, పాసవ్వాలి, అకౌంటెంట్ అవ్వాలి. అప్పుడు భార్యాభర్తలిద్దరూ అకౌంటెంట్స్ ... నిజంగా రోజెంత ఆనందంగా వుంటుంది! ●